# రామాలయంలో మీటింగు

(కథానిక)

రామలవారి గుడిదగ్గర మీటింగు జరుగుతుందని వూరంతా తెలిసిపోయింది. కారణం దానికి కావలసిన ఏర్పాట్లన్నీ మూడురోజుల్నుంచి సుబ్బారెడ్డిగారు దగ్గరవుండి చేయిస్తున్నారు. వంద ఎకరాల పొలంవున్న మోతుబరిరైతు, వేలకువేలు చక్రవడ్డీకి తిప్పుతున్న వ్యాపారి, వూళ్లో ఎవరొచ్చినా, ఏపని చెయ్యవలసి వచ్చినా తనకు తెలియకుండా, తనుచెయ్య లేకుండా చెయ్యటానికి వీలు లేనంతగా పరిస్థితుల్ని మార్చగలిగిన రాజకీయ దురంధరుడు అయిన రెడ్డిగారు స్వయంగా దగ్గరుండి విసుగు- విరామం లేకుండా, దమ్మిడీ ఖర్చు లేకుండా రైతుల్తో పాలేరుల్తో పనిచేయిస్తున్నాడు. రాములవారి గుడిముందో రెండువేల మంది సులువుగా కూర్చోటానికి వీలుగా ఉండేట్లు నేలంతా చదునుచేయించి రోజూ నీళ్లు చల్లిస్తున్నాడు. సింహద్వారాన్నే స్టేజిగా తయారుచేసి రంగుకాయితాల్లో రకరకాల హంగులు కూర్చాడు. ఆ వున్న స్థలంలోనే ఆడవాళ్లకు వేరుగా వుండేట్లు స్థలం మధ్యకు వెదురులు కట్టించాడు. ఆరోజు... మీటింగవుతున్న రోజు ఎక్కణ్ణించో రెండు బస్తాల మామిడాకు తెప్పించి, వేయించిన పందిళ్లనిండా తోరణాలు కట్టించాడు. వేదిక ఎంతో అందంగా అలంకరించాడు. ఎందుకయినా మంచిదనో ఏమో గతఎన్నికల కోసం తయారుచేయించిన పోస్టర్లు అక్కడక్కడ స్థంబాలకి కట్టించాడు. గాంధీ, నెహ్రూ, వల్లభాయిపటేలు మొదలయిన ప్రముఖ కాంగ్రెసు నాయకుల ఫోటోల్తో అలంకరించాడు. ప్రక్కన కట్టినకట్లన్నూ కూడా శుద్ధ ఖద్దరే... తను యింట్లో ఎప్పుడూ ప్రక్కనకూడా ఉపయోగించని అతిముతక ఖద్దరు ధోవతి కట్టుకున్నాడు. లాల్చీ, నాయకునికో హంగుకదా! అందుకని ఒక లాల్చీ వేసుకున్నాడు. నెత్తిన ట్రేడుమార్కు కాంగ్రెసు బురఖా, మోసాల చరఖావుంది. కాని రెడ్డిగారి టోపీ చూసిన పేదలు యీసారి యీ టోపీ ఆయన ఎవరికేస్తాడోనని బెదురు బెదురుగానే చూస్తున్నారు. అంకెలు తెలియకపోయినా, యింగ్లీషు అంకెల్తోవున్న రిష్టువాచీ అతినాజూకుగా ఆధునిక పద్ధతిలో చేతికి తగిలించాడు. ఎవరైనా చదువుకున్న కొంటెపిల్లలు రెడ్డిగార్ని చూసి "టైం ఎంతయిందండీ!" అని అడిగితే "చూచుకోండి" అని అతిఘరానాగా వాచి చూపించేవాడు. రెడ్డిగారు యీ హడావిడంతా నాల్గురోజుల్నుంచి చూస్తున్న ప్రజలకు జరుగబోయే మీటింగును గురించి ఏదో ఆలోచించ సాగారు. ఇంతఖర్చుతో తయారవుతున్న ఆ వేదిక చూస్తుంటే "మీటింగుకోసం, వేదిక వగయిరాల తయారీ" కోసం అంటూ ప్రతిరైతునుండి శిస్తుతోపాటుగా ఎకరానికి ఏరెండు రూపాయిలో వసూలుచేసి ఖర్చుపెట్టిన వందో, రెండు వందలో, పోను మిగిలిన రెండు, మూడువేలూ తన ధర్మఖాతాలో జమచేసుకునే రెడ్డిగారి యీ హంగామా అంతా చూసి పేదరైతులు గజగజలాడిపోతున్నారు.

మొన్నమొన్ననే సాముదాయక ప్రణాళికల ద్వారా యీ గ్రామానికికూడా ఒక రేడియో తెప్పించి, రేడియోకు ప్రభుత్వానికి చెల్లించవలసింది నాలుగోవంతయితే, రేడియో ఖరీదంతా వసూలుచేసిన సంగతి యింకా పాతబడనేలేదు. మొన్నమొన్ననే ప్రభుత్వం క్రొత్తగా తెరిచిన ప్రాథమిక పాఠశాల తెరిపించింది కూడా తానేనని ఎన్నో గొప్పలు చెప్పుకున్నారు. ఏదో ఒక సందర్భంలో యువజన సంఘం మీటింగులో ఆ వూరివాడే అయిన బస్తీలో చదువుకుంటున్న శేఖరం అసలు సంగతి బయటపట్టేదాకా సుబ్బారెడ్డి చెపుతున్నది నిజమేనని నమ్మారు ఆవూరి ప్రజలంతా! సాముదాయిక ప్రణాళికలంటూ అమలు

పట్టెల విజయలక్ష్మి

జరిపేందుకు ప్రభుత్వం వుద్యోగుల్ని నియమించారు. కాని యీ వుద్యోగులు వూళ్ళో పలుకుబడిగల్ల ఏ సుబ్బారెడ్డిలాంటి వాళ్ళ చేతుల్లోనో డబ్బింతాపెట్టి దండం పెట్టడంతో యిలాంటి దురాగతాలు పెరుగుతున్నాయి.

పగలు మూడుగంటలయింది. ఎన్నడూలేంది ఆవూళ్ళో బేండుమేళం వినిపించేసరికి పిల్లలు, పెద్దలు అంతా తయారయారు సంబరానికి. సుబ్బారెడ్డికి పిల్లలమీద ఎక్కడలేని మమత పుట్టుకొచ్చిందా రోజు—అతి చవకబారు మిఠాయిలు పంచిపెట్టాడు పిల్లలకి. ప్రజల మనసులమీద ఏమైనా కొంచెం సానుభూతి సంపాదిద్దామనో ఏమో—వూరేగింపు కోసం తన స్వంత రెండెడ్లబండిని ఎంతో విచిత్రంగా ఘనంగా అలంకరించాడు. వూరేగింపు సుబ్బారెడ్డి గారింటి దగ్గర్నుంచి బయలుదేరింది. పట్నంనుంచి వచ్చిన వెనకటి పడిపోయిన మంత్రిగారు బండి మీద నిల్చున్నారు. మెడంతా సుబ్బారెడ్డిగారు వేసిన పూలమాలల్తో నిండిపోయింది. ఇంకా వేసే వాళ్లు ఎవరూలేరు కాబట్టి సరిపోయింది. లేకపోతే మనిషి పూర్తిగాపూలల్లో పూడిపొయ్యేవాడేమో. "కాంగ్రెసు పార్టీకి జై" "మంత్రిగారికీ జై" "కాంగ్రెసుకే మీ ఓటు" అంటూ నినాదాలిస్తూ మధ్యమధ్యలో యిదంతాచేస్తున్నది సుబ్బారెడ్డి అని తెలియజెయ్యటానికో అన్నట్లు "సుబ్బారెడ్డికి జై" అంటున్నారు. ఊరేగింపు నడిబజార్లో కొచ్చేసరికి ఎదురుగా "కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" అంటూ పిల్లలగుంపొకటొచ్చింది, సుబ్బారెడ్డిగారు కంపరమెత్తిపోయారు. ప్రక్కనున్న తొత్తుల్ని చడామడా తిట్టాడు. "అయ్యయ్యో! తన పరువు ప్రతిష్ఠ. పట్నంనుంచి వచ్చిన పెద్దమనిషిముందు తీసేసారే!" అంటూ హృదయం మండుతూంది. కన్ను మీటాడు. కర్రలు నాట్యంచేసాయి అమాయకులయిన నిర్దోషులయిన పిల్లలవీపుమీద. అమ్మ బాబోయ్!అంటూ చెదరిపోయారుపిల్లలు-చూసుకో నాతడాఖా అన్నట్లు సుబ్బారెడ్డిగారు బుర్ర మీసాలొకసారి మెలివేసి వింతగా చూశాడు.

ఊరేగింపు రాములవారి గుడిదగ్గర చేరింది. వచ్చిన నాయకులకి అనుచరులు నీళ్లు వారబోసి దణ్ణంపెట్టారు. రెడ్డిగారు మందహాసం చేశారు. నాయకమ్మన్యుడు వేదికమీద కూర్చున్నాడు ఠీవిగా! ఇద్దరు భక్తులు వింజామరలు వీస్తున్నారు. నాయకుడు అలసిపోయాడో ఏమో అప్పుడే "ఐస్‌క్రీమ్" వచ్చింది. అతిసులువుగా చప్పరిస్తూ కూర్చున్నాడు వచ్చిన నాయకుడు—

మైకులుకూడా ఏర్పాటు చేసారు, ఎప్పటి నుంచో అనుకుంటున్నాడు సుబ్బారెడ్డి ఏదైనా సభలో మాట్లాడాలని. కాని వూర్లోవున్న పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు తనయినాకూడా, ఎన్నడూ ఒక్క మీటింగుకూడా (సభ్యులతో) పెట్టేందుకు అవసరం పట్టలేదు. వసూళ్ళేకాని, చెయ్యాలనుకున్న, చెయ్యదలచుకున్న పనులేమీ లేవు కాబట్టి పంచాయతీ బోర్డు సమావేశము దేనికి? —— వచ్చిన యీ సదవకాశాన్నయినా జారవిడవకుండా వచ్చిన నాయకుణ్ణి ప్రజలకు పరిచయం చేద్దామనుకున్నాడు. ఆ నాయకుని పేరు ఫలానా అని తెలుసును కాని అతనిని గురించి వివరాలేమీ తెలియని తను ఏమని, ఏలా పరిచయం చెయ్యగలడు?, అందుకనే మాటలు తడబడుతూనే మొదలు పెట్టాడు. "ఆర్యులారా! అమ్మలారా! అయ్యలారా!!" అంటూ ...అంతకు తప్పితే ఎలా సంబోధించాలో అర్థమయింది కాదు. ఈ పరిచయ వాక్యాలు పలకటంలో ప్రజలు కనిపెట్టేశారు రెడ్డిగారి గొప్పంతాను... వీరు... మన ముందున్న యీ కాంగ్రెసు నాయకులు మన జిల్లాలోనే పుట్టారు... సభలో ఎవరో "వారిదసలు మన జిల్లా కాదండీ!" కేకపెట్టారు.

"అవును" నాది కృష్ణాజిల్లా ... అంటూ నాయకులు చెప్పటంతో సుబ్బారెడ్డిగారు తప్పుకోక తప్పిందికాదు...

అదే... అదే... కృష్ణజిల్లా...వీరిస్థానం... అమరావతి...

"అమరావతి" కృష్ణాజిల్లాకాదండీ! రెడ్డిగారూ! అంటూ ఎవరో కుర్రాడు కేకవేశాడు వెనకనించి. ఇక ఏమి చెప్పేందుకు తోచటంలేదు- వళ్లంతా చెమట పట్టింది. గజగజా వణుకుతున్నారు రెడ్డిగారు... ఎందుకు లేచానురా దేముడా! తెలియని వాణ్ణి తెలియనట్లుండక...అని బాధపడ్తూనే ఏమి చెప్పాలో తోచక ప్రక్కనేవున్న కుర్చీలో చతికిలబడ్డాడు-ప్రజలంతా గొల్లుమన్నారు...

"సైలెన్సు" అంటూ రెడ్డిగారు అనుచరులు కేక లేస్తున్నారు నాలుగు ప్రక్కల్నించీ...యిక ఏమీ లాభంలేదనుకున్నారు వచ్చిన నాయకులు లేచినుంచున్నారు.సభలోఅంతా చప్పట్లుకొట్టారు-కొద్ది సేపట్లోనే సర్దుకుంది గోలంతా. మాజీ మంత్రి గారు మొదలెట్టారు ఉపన్యాసం...

"సోదరులారా! ఈరోజు పెద్దపండగ రోజనే చెప్పాలి. సుబ్బా రెడ్డిగారికి నాకు ఎన్నో సంవత్సరాలునుంచీ స్నేహం...

అంటుంటే సభలో కలకలం—"యిద్దరూ ఒకటే తరగతికి చెందినవాళ్లు లావుందిరా! పేదల్ని ముంచటంలోనూ. పేదలక్కొంపలు కూల్చటంలోనూ... అదుగో ఆ వేషమే చెబుతుంది ఎంత తియ్యగా సంసారాల్ని కూలుస్తాడో!"అంటూ గుసగుసలు...

"సోదరులారా! నేను చెప్పేది శ్రద్ధగావినాలి. నిశ్శబ్దంగా! ... ఈ రోజు నేను మీ ముందు నిల్చొని మాట్లాడ గలుగుతున్నా నంటే నేనెంతో గర్వపడుతున్నాను. కారణం మీరంతా కాంగ్రెసు పార్టీపై చూపించిన ఆదరాభిమానాలే... అందులోనూ ప్రజలు కమ్యూనిస్టు లన్నట్లు పిచ్చివాళ్లు కాదు...వాళ్లకు తెలుసు ఏపార్టీకి ఓటివ్వాలో వాళ్లకు ఏపార్టీ ప్రతి విషయంలోనూ సహాయ పడేదో! అందులోను వాళ్ల పార్టీ అయిన కాంగ్రెసు పార్టీని వాళ్లు మరచిపోతారని ఎవరయినా అనుకుంటే అది తప్పే అవుతుంది."

"అవును మాకు తెలుసు ఎవరికి వోటివ్వాలో! బురఖాలెవరివో నిజాయితీ అయిన అభివృద్ధి ప్రణాలిక లెవరివో! ఎవరి స్వంత జేబులు నింపుకుంటున్నారో! ఎవరికి వోటివ్వాలోకూడా"అన్నాడు చంద్రం నిల్చొని...

"అవునయ్యా! అదే నేనూ అంటున్నాను. కాంగ్రెసు పార్టీని గురించి మీకు యింత బాగా తెలిస్తే సుబ్బారెడ్డిగారు నిజంగా అభినందనీయులు" అంటుంటే సుబ్బారెడ్డి ముఖంలో హుందాయయిన హాసరేఖ తొంగిచూసింది.

"అవును నిజంగా అభినందించాలిసిందే-కాంగ్రెసుకు పర్యాయంగా ప్రతిపనిలోనూ, ప్రతివిషయంలోనూ ప్రవర్తిస్తూ కాంగ్రెసంటే ఏమిటో మాకు తెలుసుకునే అవకాశం యిచ్చాడు. కాంగ్రెసు వాళ్ళు ప్రజల్నెలా మోసపుచ్చగలరో ప్రజల్నించి డబ్బెలా పీడించి వసూలుచేయగలరో నిరూపించారు. ప్రస్తుతం మాకు బాగా తెలుసు కాంగ్రెసు పార్టీ అంటే ఏమిటో!"అంది మరోకంఠం.

"సోదరులారా! చూశారా! కమ్యూనిస్టులు అసలు సంగతులు వినకుండా చేయాలని ఎట్లా అల్లరిచేస్తున్నారో! అందుకే యిలాంటి ప్రజా వ్యతిరేకుల్ని మాటిమాటికీ సమ్మెలు అరాచకం రెచ్చగొట్టి పేదల్తో నాటకమాడే, పరాచికాలాడే యీ "కామ్రేడ్స్"ని నమ్మకండి. ఎంతో కాలం నుంచి వున్న సంస్థ...గాంధీతాత, తిలక్‌లు స్థాపించిన సంస్థ...ఈ రోజు నెహ్రూజీ యింతటి అంతర్జాతీయ కీర్తిని గడిస్తున్నాడంటే దానికి కారణం "కాంగ్రెసు సంస్థ." అందువల్ల మీరంతా యీ సారి మీ వోటును కాంగ్రెసుకే యివ్వవలసినదిగా ప్రార్థిస్తున్నాను" అంటూ మేజువాణీ నమస్కారబాణం ఒకటి విసిరారు.

అవును ముంజేతి కంకణం చూచుకునేందుకు కూడా అద్దంకావాలా? మాకు పూర్తిగా తెలుసు ఓ టెవరి కివ్వాలో...మాకెవరు అండో!...మాకెవరు అన్నివిధాలా సహాయం చేస్తారో...మేమూహించుకోగలం...మీరు ప్రజలకోసం ఇన్ని ఘనకార్యాలు చేస్తున్నారంటున్నారుకదా! ఎందుకండీ మూణ్ణాళ్ళ ముచ్చటగా మారింది మీ ప్రభుత్వం...ఈరోజు ఏన్నడూ లేంది మా ఊరంటూ ఒకటుందని కూడా తెలియని మీకు, ఓట్లకోసం మే మవసరమొచ్చామని తెలుసుకోవటం తోటే అర్థమవుతుంది, మా ఓటుకెంత విలువవుందో!... అందువల్ల మా బ్రతుకులు ఏమయినా, మేమేమయినా, మాకోసం పాటుపడే వారినే గెలిపిస్తాం.. ప్రజలు మీరనుకున్నంత గొర్రెలు కాదుసుండీ! అంటూ గొడవచేసుకుంటూ లేచిపోయారు ప్రజలంతా...

"మంచీ-చెడూ తెలియనిమూర్ఖులు" అన్నారు మాజీమంత్రి పుంగవులు.

'రాజకీయాలంటే- తెలియని రౌడీలు' అన్నారు సుబ్బారెడ్డిగారు.

"అంతా గొడవగా కల్లోలంగాఉంది... రాజకీయాలకు దూరంగావుండి సన్యసిస్తే బాగుండేటట్లుంది" అన్నాడో ప్రజాసోషలిస్టు... ★